సజావుగా ఇంటర్ పరీక్షలు

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 12 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం ఆరో రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం-2ఎ, బాటనీ, పొలిటికల్ సైన్స్‌కు సంబంధించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 97.90 హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఏర్పాటు చేసిన 54 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 16,727 మంది విద్యార్థులకు 16,375 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 352 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీకి సంబంధించి మొత్తం 15,188 మంది విద్యార్థులకు 14,925 మంది హాజరయ్యారు. 263 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 1539 మందికి 1450 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. ఎస్పీ పారితోష్ పంకజ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి గుంపులు కనిపించరాదని స్పష్టం చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ

జోగిపేట ఠాణాను తనిఖీచేసిన ఎస్పీ

అందోల్, మార్చి 12 : జోగిపేట ఠాణాను బుధవారం జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై పాండు తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావాలి

- రూ.50 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయం
- పరీక్షలను తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 12 : ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం కెరీర్ టెక్నాలజీ సంస్థ చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ టెక్నాలజీ సంస్థ చేసిన అభివృద్ధి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలను సంస్థ దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం హర్షించదగిన విషయమన్నారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి ప్రైవేటు సంస్థల యాజమాన్యం, సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. రూ. 50 లక్షలతో చేసిన అభివృద్ధి పనులను కలెక్టర్ ఈ సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, సంస్థ నిర్మాణ అధినేత నందా లక్కిరాజు, సంస్థ ప్రతినిధి అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

బీరప్ప బస్తీలో సీసీ రోడ్డును లీకేజీ పేరిట జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

జిన్నారం, మార్చి 12 : మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ల నిర్మాణంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడెప్పుడు తాగునీరు సరఫరా అవుతుందా అనే ఆశగా ఎదురుచూస్తున్న స్థానికులకు లీకేజీలు బయటపడుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం బీరప్ప బస్తీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని సంబంధిత అధికారులు గుర్తించారు. మున్సిపాలిటీ నిధులతో సరిగ్గా నెల రోజుల కింద వేసిన సీసీ రోడ్డును లీకేజీ పేరిట జేసీబీతో తవ్వేశారు. మిషన్ భగీరథ పైప్‌లైన నిర్మాణ పనులను అస్తవ్యస్తంగా చేపట్టడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. తాగునీటి సరఫరాపై కాలయాపన జరుగుతుందని దీనికి కారకులైన సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

భూములను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

జహీరాబాద్, మార్చి 12 : జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలోని గుంజోట్టి, ఇబ్రహీంపూర్‌లోని బుధవారం ప్రభుత్వ, పట్టా భూములను ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పరిశీలించారు. ప్రజావాణిలో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, పట్టా భూములను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి.., రైతులు పంటలను ఎన్ని ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు.. అన్యాక్రాంతానికి గురయ్యాయా అనే వివరాలను తెలుసుకున్నారు. ప్రజావాణిలో భూములపై ఫిర్యాదు చేసిన బాధిత రైతులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్ భూపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ రావు, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష హాల్‌లో విద్యార్థికి అస్వస్థత

జహీరాబాద్, మార్చి 12 : జహీరాబాద్ పట్టణంలోని ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థిని అస్వస్థతకు గురైంది. బుధవారం స్థానిక పట్టణంలోని పరీక్ష కేంద్రంలో ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థినీ సుజాత అస్వస్థతకు గురికావడం గుర్తించిన సిబ్బంది వెంటనే పట్టణంలోని ఏరియా దవాఖానకు తరలించారు. వెంటనే వైద్యాధికారులు అస్వస్థతకు గురైన విద్యార్థిని వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాతంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సిబ్బంది సూచించారు.

షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సదాశివపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన విశాల్ షాపింగ్‌మాల్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ యువత స్వశక్తితో ముందుకు పోవాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించి అమ్మకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, సాతాని శ్రీశైలం, డాకూర్ అశోక్, చెన్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

-సదాశివపేట, మార్చి 12

ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలి

జహీరాబాద్, మార్చి 12 : ప్రతి ఉద్యోగి నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తింపచేలా ప్రభుత్వం చట్టాన్ని తేవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని తహసీల్ ఆవరణలో నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఉల్లాస్‌మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియమక ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నిరహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గత ఉద్యోగ నోటిఫికేషన్‌లకు వర్తింపచజేస్తామన్న మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సుకుమార్, నర్సింహా మాదిగ, దీలిప్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, జైరాజ్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

నిరహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పంటలపై అన్నదాతలకు అవగాహన

గుమ్మడిదల, మార్చి 12 : అన్నదాతలకు అదమా సొసైటీ (ఇజ్రాయిల్) ప్రతినిధులు రైతులకు అవగాహన కలిగించారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో పలు పంటలపై కలిసి శ్రమిద్దాం- కలిసి అధిక ఉత్పత్తిని సాధిద్దాంపై అవగాహన కలిగించారు. కూరగాయల పంటలు, వరిధాన్యం వంటి పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు అధిక మోతాదులో వేయడం వల్ల భూసారం తగ్గి పంటలకు తెగులు, చీడ సోకుతుందని వివరించారు. సేంద్రియ పద్ధతిలో అధికంగా పంటలను ఉత్పత్తి సాధించవచ్చని రైతులకు అవగాహన కలిగించారు. రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, మాజీ అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి, రైతులు ఎండీ హనీఫ్, వెంకట్‌రెడ్డి, ముత్యాల రంగారెడ్డి, సంఘం కుమార్, సంఘంతిరుపతి, ఆకుల శ్రీనివాస్, రామగౌడ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కలిగిస్తున్న అదమా(ఇజ్రాయిల్) సొసైటీ ప్రతినిధులు

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కోహీర్, మార్చి 12 : మండలంలోని కవేళి ప్రాథమిక పాఠశాలలో రెండేండ్ల కింద చేపట్టిన మరుగుదొడ్ల భవన నిర్మాణం ఇంత వరకు పూర్తి కాలేదు. ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నిర్మిస్తున్న భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. పనులకు సరిపడా చెల్లించకపోవడంతో నిర్మాణం నిలిపివేశారు. దీంతో పాఠశాల్లో విద్యనభ్యసిస్తున్న 80 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నామని, తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు కోరారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన

హత్నూర, మార్చి12 : గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రావడంలేదని హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు.

గుండ్లమాచునూర్ గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టిన కార్మికులు

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, మార్చి 12 : గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని జహీరాబాద్ మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తట్టునారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం పిలుపు మేరకు పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లు తట్టు నారాయణ, చెన్నరెడ్డి, విజయ్ తదితరులను జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెంటనే పెం డింగ్ బిల్లులను చెల్లించేలా ప్రభుత్వం చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలి

అమీపూర్ మార్చి 12 : గడువులోగా అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ఇంటి పన్ను వసూల్‌ను వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని, అందుకు ప్రత్యేక చొరవతో పని అవసరం ఉందని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అధికారులతో రివ్యూ ఏర్పాటు చేసి కన్ను వసూళ్ల నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఆర్వో మనోహర్ బిల్ కలెక్టర్లు వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

రివ్యూలో మాట్లాడుతున్న మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

జిన్నారం, మార్చి 12 : గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామాన్ని ఇందిరమ్మ ఇండ్లు పంపిణీకి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ ప్రక్రియలో సొంత ఇల్లు కూడా లేని నిరుపేదలను గుర్తించి ఇండ్లు కేటాయించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మాదారం బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేశ్ అన్నారు. కానీ అధికార యంత్రాంగం మాజీ ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సొంత ఇల్లు ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేసి 50 గజాల్లో ముగ్గు పోయడం సిగ్గుచేటన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో సూచనలు సలహాలు తీసుకొని ఎవరికైతే సొంత ఇల్లు లేదో విచారణ జరిపి పార్టీలకతీతంగా పేదలకు న్యాయం చేయాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

అందోల్, మార్చి 12 : పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు బుధవారం తెలిపారు. పట్టణంలోని బజాజ్ షోరూమ్ సమీపంలో జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులతో పాటు రూ. 47,090 నగదు, పేక ముక్కలు లభించాయని తెలిపారు. నగదును సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి

ఎంపీడీవో రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

జహీరాబాద్, మార్చి 12 : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలను వెంటనే చెల్లించాలని న్యాల్‌కల్ మండల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అధ్యక్షుడు అబ్బాస్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంపీడీవో రాజశేఖర్‌కు వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల ఫీల్డ్‌అసిస్టెంట్ సంఘం నాయకులు వైద్యనాథ్, మార్త, సోనియా, అనుష, చంద్రకళ, సంగన్న, బీరప్ప, సునీల్, అప్పన్న పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

వట్‌పల్లి, మార్చి 12 : మహిళ ఒంటిపై ఉన్న బంగారం కోసం కిరాతకులు దారుణానికి ఒడిగట్టారు. మహిళను హత్య చేసి అమె ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకెళ్లారు గుర్తు తెలియని దుండగులు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొట్టె గౌరమ్మ(45)ను ఒంటిపై ఉన్న బంగారం మీద కన్నేసిన కిరాతుకులు మంగళవారం అర్ధరాత్రి ఎవరూ లేని సమయం చూసి ఆమెపై దాడికి పాల్పడ్డారు. దాడిలో గౌరమ్మ ఎదురు తీరగడంతో గొంతు నులిమి చంపి, ఒంటిపై ఉన్న కమ్మలు, గుండ్లు, కడియాలు తీసుకొని దుండగులు పరరాయ్యారు. బుధవారం మృతురాలి తమ్ముడు నల్లవల్లి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 12 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించి పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఫోరం ఫర్ బెట్టర్ సంగారెడ్డి, పేరెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవో పరమేశం, ఎస్సీ కార్పొరేషన్ డీడీ అఖిలేష్‌రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ బెట్టర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు కొన్ని నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజు మార్కుంది, ఫోరం ఫర్ బెట్టర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి మహేశ్ కుమార్, సహాయ కార్యదర్శి పాండురంగం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీధర్ మహేంద్ర తదితరులు

సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధి అవకాశాలు

హత్నూర, మార్చి 12 : పారిశ్రామిక రంగంలో రోజురోజుకూ వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధి అవకాశాలు పొందవచ్చని జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా సీఎస్‌ఆర్ జనరల్ మేనేజర్ అవిలాష్ ద్వివేది సూచించారు. హత్నూర ఆర్‌ఐటీఐలో సెంటమ్ ఫౌండేషన్ సహకారంతో మహీంద్రా అండ్ మహీంద్రా ఆధ్వర్యంలో ఐటీఐ విద్యార్థులకు మూడు నెలలుగా హానర్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అసెంబ్లీ లైన్ ఆపరేటర్‌లో శిక్షణ ఇచ్చారు. దీంతో శిక్షణ పూర్తిచేసుకున్న 160 మంది విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. మహీంద్రా అండ్ మహీంద్రా హెడ్ గనేశ్, డీజీఎం అడ్మిన్ సెక్యూరిటీ సీఎస్‌ఆర్ ప్రదీప్‌గౌడ్, కార్పొరేట్ సీఎస్‌ఆర్ డీజీఎం వదన్‌రాం, అడ్మిన్ సునీల్ శాగంగి, సెంటం ఫౌండేషన్ డైరెక్టర్ ధృవ్‌మిట్టల్, సీనియర్ మేనేజర్ దర్శన్‌సావంత్, ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

దంపింగ్‌యార్డును రద్దు చేయాలి

రిలే నిరహారదీక్షలు చేస్తున్న నాగిరెడ్డిగూడెం గ్రామస్తులకు సంఘీభావం తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి12 : డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే రద్దు చేయాలని 36 రోజులుగా రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలో రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు 36వ రోజు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఇందులో మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సీతారాంరెడ్డి, విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగమణి, సబిత, రాణమ్మ, కిష్టమ్మ, పోచమ్మ దీక్ష చేపట్టారు. వీరికి రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మందభాస్కర్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ శర్మ, కరుణాకర్, సత్యనారాయణ, బాల్‌రెడ్డి, వీరేశ్, మంగయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 36వ రోజు రిలే నిరాహారదీక్షలో గ్రామస్తులు డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, రాజుగౌడ్, కుమ్మరి ఆంజనేయులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

జిన్నారం, మార్చి 12 : ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న దూదేకుల దావూద్ (69) మాదారం గ్రామంలో కుమారుడి దగ్గర నుంచి కొడకంచి గ్రామానికి వెళ్లే మార్గంలో వెళ్లాడు. అలా వెళ్లిన దావూద్ తిరిగి ఇంటికి రాలేదు. వృద్ధుడికి మతిస్థిమితం బాగాలేదు. దీంతో వృద్ధుడి కొడుకు దూదేకుల షాబుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దూదేకుల దావూద్ (ఫైల్)

పలు అభివృద్ధి పనులకు 'న్యూలాండ్' శ్రీకారం

గుమ్మడిదల, మార్చి 12 : న్యూలాండ్ ల్యాబరేటరీ పరిశ్రమ రూ. కోటి 34 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీ పరిధిలోని పీహెచ్‌సీలో మెటర్నిటీవార్డు కోసం రూ.30 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో అదనపు భవనాన్ని నిర్మించారు. దీనిని బుధవా రం న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ సెక్రెటరీ శారద, హెచ్ మేనేజర్ కృష్ణమోహన్, హెచ్‌ఆర్ రవి, లక్ష్మణ్ వీరప్రసాద్, శ్రీధర్ నాయుడు కలిసి డాక్టర్ మధుకర్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్‌రావుతో కలిసి మెటర్నటీ వార్డు భవనాన్ని అందుబాటులోని తీసుకొచ్చారు. అనంతరం నాగిరెడ్డిగూడెంలో ప్రాథమిక పాఠశాలలో రూ. 20 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో అదనపు భవాన్ని నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. దోమడుగు గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో రూ.34 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో యూజీడీ, ప్రహ రీ, అదనపు గది, స్కూల్ ప్రాంగణంలో సీసీ పనులు మెరుగు పరిచారు. జిన్నారం మండలంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయురాలు మృదుల, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ వినతి మేరకు రూ. 50లక్షల నిధులతో అదనపు పాఠశాల గదుల కోసం శంకుస్థాపన చేశారు. అయాగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో పీహెచ్‌ఎసీలో మెటర్నటీ భవాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్న న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ యాజమాన్యం

చెత్తను డంప్‌చేసి.. ఆపై నిప్పుపెట్టి

- సమీప పొలాల్లో పనులు చేస్తున్న రైతులకు ఇబ్బందులు
- చెత్తను రోడ్డు పక్కల, అడవిలో డంప్ చేసి తగలబెడుతున్న సిబ్బంది

ఝరాసంగం, మార్చి 12 : ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేయాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కంపోస్టు షెడ్లను నిర్మించింది. సేకరించిన చెత్తతో పొడి చెత్తలోని ప్లాస్టిక్, ఇనుము తదితర వస్తువులను వేరుచేయాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి గ్రా మ పంచాయతీలకు ఆదాయం పెంచాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పాటు గ్రామాల్లో పారిశుధ్యాన్ని, స్వచ్ఛతను మరింత మెరుగుపర్చాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించి ప్రజలకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసింది. పంచాయతీ సిబ్బందికి ట్రాక్టర్ సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఝరాసంగం మండల కేంద్రంతో పాటు కుప్పానగర్‌లో నిత్యం ట్రాక్టర్ల ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను ఊరు బయట రోడ్డు పక్కల, అడవిలో డంప్ చేసి దానికి నిప్పు అంటిస్తున్నారు. అంటుకున్న నిప్పుతో రోజుల తరబడి పొగ లు వ్యాపిస్తున్నాయి. అడవిలో డంప్ చేసిన చెత్తలొంచి ప్లాస్టిక్ కవర్లు గాలికి కొట్టుకుపోయి సమీప పొలాల్లో చేరడంతో పాటు వాటిని మూగజీవులు తినడంతో ఇబ్బందులు నెలకొంటున్నాయని రైతులు చెబుతున్నారు. ఒక్కో ప్రత్యేక అధికారికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించడం, వారు చుట్టపు చూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారిపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి రోడ్డు ప్రక్కల, అడవిలో డంప్ చేస్తున్న చెత్తను డంపింగ్ యార్డులో వేసేలా చర్యలు తీసుకొని సేంద్రి య ఎరువు తయారు చేసేలా చూడాలని గ్రామస్తులను కోరుతున్నారు.

డంప్‌చేసిన చెత్తకు నిప్పంటించడంతో పొగలు వ్యాపిస్తున్న దృశ్యం

ఎల్ఆర్ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అందోల్, మార్చి 12 : ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పాండు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కును తనిఖీచేసి దరఖాస్తులు స్వీకరించారు. కమిషనర్ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహానికి వంట సామాన్లు పంపిణీ

సంగారెడ్డి, మార్చి 12 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శిశుగృహల్లో వసతి పొందుతున్న చిన్నారులకు బుధవారం బియ్యం వంట సామాన్లను ఎల్ఐసీ సిబ్బంది అందజేశారు. ఎల్ఐసీ శాఖాధిపతి మారుతిరావు యూనియన్ నాయకులు సతీశ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పుల్లూరి ప్రకాశ్, అసిస్టెంట్ మేనేజర్ సతీశ్, గోపాల్‌రెడ్డి, రాజారాంరెడ్డి, మహిళా సి బ్బంది పాల్గొన్నారు.

సామాన్లు అందజేస్తున్న ఎల్ఐసి సిబ్బంది

పరామర్శ

అందోల్, మార్చి 12 : బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుధవారం పరామర్శించారు. అందోల్‌కు చెందిన నేత వడ్ల శ్రీనివాస్ తండ్రి పర్వయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్, నాయకులు రత్నంగౌడ్, సత్యం, నాగరాజు, శేకర్, బబ్లు, రఫీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

సింగూరు పంచాయతీ కార్యదర్శిపై విచారణ

పుల్కల్, మార్చి 12 : మండలంలోని సింగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగయ్య అవినీతి అక్రమాలకు పాల్పడడంతో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించి నిధులు సైతం దుర్వినియోగం చేస్తున్నాడని సింగూరు గ్రామస్తులు ఇటీవల ఎంపీడీవో ఆనంద్ మేరీకి ఫిర్యాదు చేశారు. అయితే విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న డీపీవో సాయిబాబా ఆదేశాల మేరకు బుధవారం డీఎల్‌పీవో అనిత సింగూరు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. సంతకాలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు

సంగారెడ్డి, మార్చి 12 : వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని, వసతిగృహ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.